ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 17.04.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

2. తెలంగాణ గురించి కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ - కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

3. హైదరాబాద్ మైలార్ దేవుపల్లి నుంచి వట్టేపల్లి వరకు సుమారు 71 కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని ఈ ఉదయం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు.

4. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను, జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షక సంస్థ మార్గదర్శకాల మేరకే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**కిషన్ రెడ్డి**

దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఈ ఉదయం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకమని, ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

డెస్క్

**పొన్నం**

తెలంగాణను భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిన్న పార్లమెంట్ స్పీకర్‌కు తాము విన్నవించినట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిర్వహించిన విలేఖరుల సమావేశంలో తేజస్వి సూర్య తన తప్పును అంగీకరించారని చెప్పిన నేపథ్యంలో కిషన్ రెడ్డే స్వయంగా చొరవ తీసుకొని ఆ వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించేలా చర్యలు తీసుకోవాలని పొన్నం కోరారు.

డెస్క్

**ప్రహ్లాద్ జోషి**

కేంద్ర ఆహార  పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం అయ్యారు. 2025-26 వానా కాలం, యాసంగి సీజన్ కు 30 లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ ధాన్యం సేకరించాలని కేంద్ర

మంత్రికి ముఖ్యమంత్రి, మంత్రి విన్నవించారు. ఈ యాసంగి సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేంద్ర మంత్రికి తెలియజేశారు.

డెస్క్

**BANDI SANJAY:**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీజేపికి ఈ అంశంపై పేరు వస్తుందనే అక్కసుతో రాజకీయం చేస్తున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మొదటి నుంచి చిత్తశుద్ధితో పని చేసిన పార్టీ బిజేపియేయని చెప్పారు. పార్లమెంట్ లో తెలంగాణ ఉద్యమ కారులపై ఎంపీ తేజశ్వీ యాదవ్ ప్రస్తావించిన అంశాన్ని అనవసరంగా వివాదం చేస్తున్నారని బండి సంజయ్ అన్నారు. భారతదేశ చరిత్రలో గుర్తిండిపోయే విధంగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే అద్భుత గడియలని, దేశ ప్రజలు చూడబోతున్నారని పేర్కొన్నారు.

MSM

**శ్రీధర్ బాబు**

హైదరాబాద్ లోనిమైలార్ దేవుపల్లి నుంచి శాస్త్రీపురం మీదుగా వట్టేపల్లి వరకు 71 కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని ఈ ఉదయం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. నాలుగు లేన్లతో కూడిన ఈ బ్రిడ్జి న పొడవు 490 మీటర్లు కాగా, వెడల్పు 16.6 మీటర్లు. రైల్వే పోర్షన్ పొడవు 37.28 మీటర్లు. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో మైలార్ దేవుపల్లి నుంచి ఫలక్ నుమా వరకు 30 నిమిషాల్లో చేరుకోవచ్చని అధికారులు తెలియజేశారు.

డెస్క్

**సీఎం రివ్యూ**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షక సంస్థ మార్గదర్శకాల మేరకే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి అధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల అంశంపై నిన్న సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల వద్ద పరీక్షలు, బోర్ల తవ్వకాలు, పనుల్లో వేగం పెంచే చర్యలు ఎంతవరకు వచ్చాయంటూ ముఖ్యమంత్రి ఆరా తీశారు. బ్యారేజీల పునరుద్ధరణలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. బ్యారేజీలను పకడ్బందీగా పునరుద్ధరించి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు.

డెస్క్

**బీమా**

రాష్ట్ర వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు ప్రయోజనం కలిగించేలా.. వచ్చే వానాకాలం నుంచి 'తెలంగాణ విశిష్ట పంటల బీమా పథకం' అమలు చేయాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రభుత్వానికి సూచించింది. ఉచిత ప్రీమియంతో రైతులందరికీ వర్తింపజేయడం, ప్రభుత్వంపై ఆర్థికపరమైన ఒత్తిడిని తగ్గించడం, పరిహారం క్లెయిమ్‌ల సత్వర, పారదర్శక పరిష్కారం వంటి లక్ష్యాలతో దీన్ని అమలు చేయాలని పేర్కొంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు బదులు.. రాష్ట్ర ప్రభుత్వమే 100 శాతం ప్రీమియం చెల్లించి కొత్త పథకాన్ని చేపట్టాలని సిఫార్సు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్రివర్సిటీ పంటల బీమాపై సమగ్ర అధ్యయనం చేసి నిన్న నివేదిక అందజేసింది.

డెస్క్

**కిషన్ ప్రధాని**

కేంద్ర ప్రభుత్వం చేపట్టి పూర్తికావచ్చిన ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, నిర్మాణం ప్రారంభించాల్సిన ప్రాజెక్టుల శంకుస్థాపన కోసం తెలంగాణలో పర్యటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. తెలంగాణలో పరిశ్రమలు,

ఏవియేషన్, రైల్వేలు, రహదారులు, ఆదివాసీ సంక్షేమం సహా వివిధ రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని ఆ లేఖలో వివరించారు. ఇందులో ఆరు ప్రారంభించాల్సిన ప్రాజెక్టులు కాగా.. మిగతా నాలుగు శంకుస్థాపన చేయాల్సినవి. మొత్తం 10 ప్రాజెక్టుల విలువ 4వేల 818 కోట్ల 36 లక్షలు. వాటి జాబితాను ప్రధానికి రాసిన లేఖతో కిషన్‌రెడ్డి జత చేశారు. రాష్ట్ర పర్యటనకు సమయం ఇవ్వాలని కోరారు.

డెస్క్

**ఫైర్ అవార్డ్స్**

తెలంగాణ ఫైర్ సర్వీసెస్ కు చెందిన పది మందికి కేంద్ర ఫైర్ సర్వీసెస్ డైరెక్టరేట్ జనరల్ ప్రతిష్టాత్మకమైన బ్రోంజ్ డిస్క్ కమెండేషన్ సర్టిఫికేట్ పురస్కారాన్ని ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్, హోం గార్డ్స్ తదితర భద్రతా సంస్థల సిబ్బంది అత్యుత్తమ విధి నిర్వహణ, ధైర్యసాహసం, విశిష్ట సేవలకుగాను ఈ పురస్కారాన్ని అందిస్తారు. మన రాష్ట్రం నుంచి ఒకేసారి ఇంతమందికి ఈ విశిష్ట పురస్కారం లభించడం పట్ల ఫైర్ సర్వీసెస్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ విజేతలను అభినందించారు.

డెస్క్

**సదస్సు**

ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఛేంజింగ్ సినారియో ఇన్ ఏరోస్పేస్ ; ఆర్ అండ్ డీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సర్టిఫికేషన్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ మెంబర్ డాక్టర్ వీకే సారస్వత్, సీఎస్ఐఆర్ డీజీ అండ్ డీఎస్ఐఆర్ సెక్రటరీ డీ.ఎన్ కళైసెల్వి తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

**డిజిపి శివధర్ రెడ్డి**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా ఈరోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించిన అరైవ్ - అలైవ్ రోడ్డు భద్రత అవగాహనా సదస్సు కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజీపీ మాట్లాడుతూ... అరైవ్ అలైవ్ అంటే క్షేమంగా వెళ్ళి ప్రాణాలతో రండి అని అర్థం అన్నారు. రోడ్డు ప్రమాదాలు సామాజిక సమస్యగా మారిందని, ప్రభుత్వ కార్యక్రమంలో దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. టూ వీలర్ నడిపేవారు హెల్మెట్ ధరించడం, సరైన విధానంలో స్ట్రాప్ ధరించడం తప్పనిసరని సూచించారు.

పిటిసి, కరీంనగర్

**వాతావరణం**

నేడు రాష్ట్రవ్యాప్తంగా పీక్ హీట్‌వేవ్ పరిస్థితులు కొనసాగుతాయని హైద్రాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో 45 డిగ్రీల వరకు, హైదరాబాద్‌లో 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనీ పేర్కొంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ప్రయాణాలు మానుకుని, తగినంత నీరు తాగుతూ అప్రమత్తంగా ఉండాలనీ తెలిపింది. అయితే, సాయంత్రం వేళ అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఈ వర్షాల వల్ల వేడి తగ్గకపోగా, గాలిలో తేమ పెరిగి ఉక్కపోత మరింత ఇబ్బంది పెట్టనుంది. ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పిటిసి, హైదరాబాద్

**ఈసీలు**

రాష్ట్రంలోని ఐదు విశ్వ విద్యాలయాలకు పూర్తిస్థాయి పాలక మండళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా, తెలంగాణ, శాతవాహన యూనివర్సిటీతో పాటు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి ఈసీ సభ్యులను నియమిస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా నిన్న వేర్వేరుగా జీఓలు జారీ చేశారు.

అంబేడ్కర్ వర్సిటీకి నలుగురు సభ్యులు, మిగిలిన నాలుగు విశ్వవిద్యాలయాలకు తొమ్మిది మంది చొప్పున సభ్యులను నియమించారు.

డెస్క్

**టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు**

ఈ వేసవిలో 42 రోజుల పాటు నిర్వహించే టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ వేసవి శిక్షణ కోర్సును హైదరాబాద్, హనుమకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్ లో నిర్వహించనున్నారు. కోర్సు మే 1వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు జరుగుతుంది. అభ్యర్థి పదో తరగతి లేదా సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత వృత్తిలో లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసి ఉండాలని అధికారులు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించరాు.

డెస్క్

**ఫ్రీ ఎంట్రీ**

ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా తెలంగాణ హెరిటేజ్ విభాగం ఆధీనంలోని అన్ని మ్యూజియంలు, స్మారక కట్టడాలలో రేపు  ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు తెలిపారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్ స్టేట్ మ్యూజియం, కుతుబ్ షాహీ సమాధులు, భోనగిరి కోట, కరీంనగర్ లోని ఏలగందుల కోట, పిల్లలమర్రి, పానగల్, ఆలంపూర్ మ్యూజియంలతో సహా పలు చారిత్రక ప్రదేశాలకు రేపు ఎటువంటి టికెట్ లేకుండా వెళ్ళవచ్చని తెలియజేశారు. అలాగే, రేపు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ స్టేట్ మ్యూజియంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డెస్క్